పడిపోయిన మామిడి ధరలు

- మండీల్లో కొద్దిరోజులుగా మగ్గుతున్న కాయలు
- వ్యాపారులను రానివ్వని దళారులు
- నష్టాల్లో రైతులు


కుప్పగుట్టపల్లె వద్ద మండీల్లో కుప్పలు పోసిన మామిడి కాయలు

చక్రాయపేట : మామిడి ధరలు తగ్గిపోవడంతో రైతులు డీలా పడ్డారు. కాయలు కొనే వారు లేరు. ఎవరైనా వ్యాపారులు వస్తారనుకుంటే దళారులు అడ్డుకుంటున్నారు. దీంతో కొద్ది రోజులుగా కాయలు మండీల్లోనే మగ్గి పోతున్నాయి. వచ్చిన మేరకు సొమ్ము చేసుకుందామంటే సూటు టన్నుకు 10 శాతం, కమీషన్ వందకు 10 శాతం, కూల్లు, లారీ బాడుగలకు సరిపోతోందంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. నిరుడు కంటే ఈయేడు ధరలు భారీగా తగ్గడంతో దిక్కుతోచని రైతన్న విల విల లాడి పోతున్నాడు.

బయటకు పంపి అమ్ముకునేది చేతకాదు..

రైతులు తాము పండించిన మామిడి కాయలను బయట ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ము కోవడానికి చేత కాక దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు మాత్రం వ్యాపారులను గుప్పెట్లో పెట్టుకుని డిల్లీ, ముంబై తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి భారీగా లబ్ధి పొందుతున్నారు. ఎవరైనా లారీల్లో తీసుకెళితే ఇక్కడి వ్యాపారుల అనుమతి లేనిదే అక్కడ కొను గోలు చేయరని కొందరు రైతులు పేర్కొం టున్నారు.

తూకాల్లోనూ మోసమే

మండీల్లో రైతులు తెచ్చిన మామిడి కాయల తూకాల్లోనూ మోసాలు చేస్తున్నారు. మామిడి కాయలను గ్రేడింగ్ చేశాక కెరిట్‌లకు నింపుతారు. తూనికల యంత్రంపై రెండు కెరిట్‌లు పెట్టి తూకం వేస్తారు. వాటి తూకం 27.700 గ్రాములు వస్తే వ్యాపారులు మాత్రం 27 కిలోలకే వేసుకుంటారు. 800 గ్రాములకు పైన వస్తే కిలో కింద లెక్క కడతారు. ఇలా తూకాల్లోనూ రైతులు భారీగా వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. ఉదాహరణకు పది మార్లు తూకంలో 700ల గ్రాముల లెక్కన ఎక్కువ వస్తే రైతులకు 7 కిలోల నష్టం. వ్యాపారులకు లాభం. పైగా టన్నుకు వంద కిలోలు సూటు కింద ఇవ్వాల్సిందేనని రైతులు వాపోతున్నారు.

ధరల విషయానికి వస్తే

మండీలోకి రైతులు తెచ్చిన కాయలకు డబ్బు వ్యాపారులు ఇక్కడే ఇస్తారా అంటే అదీలేదు. రైతులు తెచ్చి కాయలను తూకాలు వేసుకుని లారీలకు ఎత్తి పంపుతారు. అక్కడ వ్యాపారులు అమ్మిన ధరలో ఇక్కడి వ్యాపారులు కొంత లాభంపెట్టుకుని తగ్గించి రైతులకు ఇస్తారు. ఇందులో కమీషన్ 10 శాతం, లారీ బాడుగ, కూల్లు అన్ని తీసి మిగిలిన మొత్తం రైతు చేతిలో పెడతారు. మధ్యలో లారీలు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యమైనా, మరమ్మతులకు గురై ఆలస్యంగా వెళ్లి కాయలు దెబ్బతింటే ఆనష్టం రైతు భరించాల్సిందే. ఈ విషయంలోనూ రైతుకే దెబ్బ కాని వాప్యారి మాత్రం ఏమాత్రం నష్టపోడు.

దళారుల గుప్పిట్లో రైతులు

కొందరు రైతులను దళారులు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. దళారులు చేసే మోసాలపై ఎవరైనా ఎదురు ప్రశ్నిస్తే వారి చేతుల్లో ఉన్న రైతులు ఎదురు దాడికి దిగుతారు. దళారుల గుప్పిట్లో ఉన్న వారి కాయలకు మాత్రం ధర హెచ్చుగానే ఉంటుందని రైతులు తెలిపారు.

ధరల తీరు	ప్రస్తుతం కిలో	గత సం..
బేనీష	20	50
హిమయత్	50	80
లాల్‌బార్	08	25
సువర్ణరేఖ	12	40
తీతర్	12	30
నీలం అడిగే		
వ్యాపారే లేడు	00	15
బెంగళూరు	10	15
రసాలు	10	30
కేసరి	12	35
మల్లెగుబ్బ	15	50
ఆల్‌ఫాన్స్	24	80


ఎక్స్‌పోర్టు లేక మండీలో ట్రేలలో మగ్గుతున్న మామిడి కాయలు

ఎంత కాలం నష్టపోవాలి



మామాడి తోటల రైతులు ఇంకా ఎంత కాలం ఇలా నష్ట పోవాలో అర్థం కాలేదు. దళారులు చెప్పినట్లు తలూపాల్సిందే తప్ప స్వతహాగా పండించిన కాయలు అమ్మునే పరిస్థితి లేదు.ప్రభుత్వాలు అందు బాటులో జ్యూస్ ఫ్యాక్టరీలు పెట్టినా,గిట్టు బాటు ధరలు కల్పించినా కొంత మేర రైతులకు న్యాయం జరుగుతుంది.

– అల్లపురెడ్డి సూర్యప్రసాదరెడ్డి, మహబూబ్‌నగర్, సురభి

మండీల్లో మగ్గి పోతున్నాయి



తోటల్లో కోసుకొచ్చిన కాయలన్నీ మండీల్లోనే మగ్గి పోతున్నాయి.అవి ఎప్పుడు లారీలకు ఎత్తి పంపుతారో తెలీదు.ఇంకా రెండు మూడు రోజులు కాయలు కోయద్దని మండీ వారు చెబుతున్నారు.భారీగా గాలి వస్తే ఉన్న కాయలన్నీ రాలి పోతాయి. దిక్కు తోచక అల్లాడి పోతున్నాం.తెగుళ్లకు మందులు స్ప్రే చేయడానికి తెచ్చిన అప్పులు తెచ్చాం,అప్పుల వాళ్లు డబ్బు అడుగుతున్నారు.

– పి.శ్రీనివాసులు, కుప్పగుట్టపల్లె

31న చలో వరంగల్‌ను విజయవంతం చేయండి

కమలాపురం : ఈనెల 31న నిర్వహించే చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్ పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం కమలాపురంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలసి చలో వరంగల్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుని ఈనెల 31న వరంగల్‌కు వస్తున్నారని ఆయన తెలిపారు. మందకృష్ణ రాకను పురస్కరించుకుని భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు అన్ని గ్రామాల్లో ఉన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే అదో రోజు హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సదస్సు జరుగుతుందన్నారు.

మహానాడుతో ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుంది

వేంపల్లె : తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలులో విఫలమై, మహానాడు జరుపుకోవడం, నిజంగా ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందని వైఎస్సార్‌సీపీ ప్రచార రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిస్సార్ బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఆర్థిక పరిమితులు, బడ్జెట్ కేటాయింపుల లోపం, మరియు పాలనా లోపాలు ఈ పథకాల అమలుకు అడ్డంకులుగా నిలిచాయన్నారు. ఈ పథకాలు అమలు విషయమై ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం, ఈ రెడ్ బుక్ పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ పరిస్థితులు ప్రజల్లో మరోసారి మోసపోయామని నిరాశ, అసంతృప్తితో రగిలిపోతున్నారని, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వ ఎంఎల్ఏలను, మంత్రులను ఇళ్లను ముట్టడించి ప్రజలు ప్రతిఘటించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

దోమ కాటు ఆరోగ్యానికి చేటు


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ ఆయేషా

సింహాద్రిపురం : దోమ కాటు ఆరోగ్యానికి చేటు అని బిదినంచర్ల వైద్యాధికారి డాక్టర్ ఆయేషా తెలిపారు. బుధవారం మండలంలోని బిదినంచర్ల గ్రామంలో వైద్యాధికారి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన, డ్రై డే ఫ్రైడే ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు దోమలవల్ల వ్యాపించే వ్యాధుల గురించి, వాటి నివారణ చర్యలను తెలియజేశారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, ఆరోగ్య విస్తరణాధికారి సుకుమార్, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపకుడు ఎన్టీఆర్

వేంపల్లె : సమసమాజ స్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు అని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకుని ఆయన ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నమూనా పరీక్షలు ఉపయోగపడుతాయి


డీఎస్సీ నమూనా ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : నేటి పోటీ ప్రపంచంలో మన సామార్థ్యం ఎంత ఉందో తెలుసుకోవటానికి పోటీ పరీక్షలు ఎంతో ఉపయోగపడుతాయని ఎస్పీ డిగ్రీకాలేజి కరస్పాడెంట్ పి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్పీ డిగ్రీకాలేజి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఎస్సీ నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. డీఎస్సీ పరీక్షల్లో లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. అనంతరం పరీక్ష పేపర్‌లను విడుదల చేసి అభ్యర్థులకు అందించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు.

ఉచిత బోర్లు వేయించాలి

వేంపల్లె : మండలంలో ఉన్న దళిత వ్యవసాయ భూములకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా బోర్లు వేయించాలని ఎస్సీ సెల్ టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య కోరారు. బుధవారం వేంపల్లెలోని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలా వీరాంజనేయ స్వామిని టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో దళితులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన డికెటి భూములకు ఆన్‌లైన్‌లో వన్ బి, అడంగల్లు రావడంలేదని, వాటిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఆన్‌లైన్‌లో వన్‌బి, అడంగల్ల మంజూరు కృషి చేయాలన్నారు. ఎక్కువగా దళిత వ్యవసాయ భూములు కబ్జాకు గురవుతున్నాయని, భూములు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి ఫోన్ చేసి అంబేడ్కర్ భవనంకు స్థలం కేటాయించాలని ఆదేశించారు. వన్ బి, అడంగల్, వ్యవసాయ భూములకు బోర్లు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దళితుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తమ ఏడాది పాలన ఎలా వుందని ప్రజలను అడిగే దమ్ము సీఎంకు ఉందా?


పీ నరేన్ రామాంజులరెడ్డి

వల్లూరు : మహానాడు వేదికపై నుండి తమ ఏడాది పాలన ఎలావుందని ప్రజలను అడిగే దమ్ము సీఎం చంద్రబాబునాయుడుకు వుందా అని వైఎస్ఆర్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పీ నరేన్ రామాంజులరెడ్డి సవాల్ విసిరారు. బుధవారం ఆ యన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత మహానాడు కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాలంటూ పరిచయం చేసే సందర్భంగా చంద్రబాబునాయుడు ఒక్కో పథకం గురించి చెప్పి ఏలా వుంది తమ్ముల్లూ, ఎలా వుంది చెల్లెల్లూ అంటూ వేదికపై నుండి అడిగే వారని, మరి అధికారంలోకి వచ్చి ఏ దాది పూర్తి అయిన నేపథ్యంలో తమ పాలనలో ఏ దో సాధించామంటూ కడపలో నిర్వహిస్తున్న మహానాడు వేదికపై నుండి అదే ప్రజలను తమ ఏడాది పాలన గురించి అడిగే దమ్ము సీఎం చంద్రబాబునాయుడుకు గానీ, ఆయన తనయుడు లోకేష్‌బాబుకు గానీ వుందా అని ఆయన సవాల్ విసిరారు.

మేమేం చెప్పినా ప్రజలు వింటారనే జిల్లాపై వివక్ష

రాష్ట్రంలో దాదాపు 100కు పైగా కార్పొరేషన్ పదవులు ఇచ్చినప్పటికీ అందులో వైఎస్ఆర్ జిల్లాలోని టీడీపీ నేతలకు కనీసం ఒక రాష్ట్రస్థాయి పదవైనా ఎందుకు ఇవ్వలేక పోయారని ఆయన ప్రశ్నించారు. కార్యకర్తే అధిపతి అంటూ మాట్లాడుతున్న సీఎంకు వైఎస్ఆర్ జిల్లాలోని కార్యకర్తలు, నేతలు కనిపించలేదా అన్నారు. తొలిసారి జిల్లాలో జరుగుతున్న మహానాడులో జిల్లా అభివృద్ధికి సంభందించి ఎలాంటి ప్రకటన లేక పోవడం చూస్తే జిల్లాపై వివక్ష స్పష్టమవుతోందని విమర్శించారు.

బాబు పదవికి మాత్రమే ష్యూరిటీ

2023లో రాజమండ్రిలో జరిగిన మహానాడులో సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ అంటూ చంద్రబాబు నాయుడు ప్రకటించారని, తమ సంవత్సర పాలనలో సూపర్ సిక్స్ పథకాలకు మాత్రం ఎలాంటి ష్యూరిటీ లభించలేదు గానీ చంద్రబాబు నాయుడుకు మాత్రం సీఎం పదవి గ్యారెంటీగా లభించిందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకా లను అమలు చేస్తామని ప్రకటించారని, మరో రెండు మూడు రోజుల్లో ఖరీఫ్ సీజన్, 15 రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానునన్న నేపథ్యంలో మహానాడు వేదికపై నుండి వాటి అమలు తేదీలను ప్రకటించి తమ చిత్తశుద్ధిని చాటుకునే ద మ్ము సీఎంకు గానీ, ఆయన తనయునికి గానీ వుందా అని ప్రశ్నించారు. మేమేం చెప్పినా ప్రజలు న మ్ముతారని తండ్రీ కొడుకులు భావిస్తున్నారు.

మొత్తం మీద మహానాడులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి నుంచి మంత్రులు, ఇతర నేతలంతా సీఎంను, ఆయన తనయుని పొగడానికి తప్ప, తమ పాలన గురించి చెప్పుకోలేని పరిస్థితిలో ఆ పార్టీ వుందనడానికి నిదర్శనమన్నారు. మహానాడు కార్యక్రమంలో పథకాల అమలుపై ఏవైనా స్పష్టమైన ప్రకటనలు వుంటాయని ఎదురు చూసిన రాష్ట్ర ప్రజలకు నిరాశ మిగిలిందని అన్నారు.

కూటమి ప్రభుత్వానివి అనైతిక రాజకీయాలు

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


గూడూరు ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనైతిక రాజకీయాలు చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని స్వగృహం వద్ద కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు గడిచిన సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి పథకాలు అందించలేదన్నారు. ఎన్నికలప్పుడేమో సూపర్ సిక్స్ పథకాలంటూ ఇంటింటా రాష్ట్రంలోని ప్రతి గడపకు వెళ్లి ఊదరగొట్టారన్నారు. వీరి అబద్ధపు మాటలకు ప్రజలు మోసపోయి తెలుగుదేశం పార్టీకి అధికారాన్ని కట్టబెట్టడం జరిగిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొండిచేయి చూపారన్నారు. ఎన్నికలప్పుడేమో సంపద సృష్టిస్తానని, అన్ని పథకాలు అమలు చేస్తానన్న చంద్రబాబు.. ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ ఏమాత్రం తమ వద్దలేదని ప్రజలను మోసపూరిత మాటలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మాటలను నమ్మి మోసపోయామని వాపోతున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యంగా మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రతి నిత్యం ఏదోక చోట మహిళలపై, చిన్నారులపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు.

సంతకొవ్వూరు కాలువకు నీటిని వదలాలి

బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని తొండూరు మండలానికి చెందిన పలువురు రైతులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతన్నలు ఉల్లి, సోయా చిక్కుడు వంటి పంటలతోపాటు ఇతర పంటలను పండిస్తున్నారని, పైడిపాలెం రిజర్వాయర్ నుంచి సంతకొవ్వూరు కాలువకు నీటిని వదిలితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీకి విన్నవించారు. దీనికి ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. అలాగే ఏపీజీబీ బ్యాంక్‌లో క్రాప్ లోన్‌కు సంబంధించి రూ.2 లక్షలు మాత్రమే ఇస్తున్నారని, ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ ప్రకారం రూ.5 లక్షల వరకు ఇచ్చే వెసులుబాటు ఉందని ఆయనకు తెలిపారు. దీనికి ఎంపీ బ్యాంక్ అధికారులతో మాట్లాడతానని భరోసా ఇచ్చారు.

మా ఉద్యోగాలు రెన్యువల్ చేయాలి

బుధవారం ప్రజా దర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని స్థానిక మెడికల్ కళాశాలకు సంబంధించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా వారు మార్చి 8వ తేదీ నాటికి తమ సంవత్సర అగ్రిమెంట్ తీరిపోయిందని, తర్వాత తమను రెన్యువల్ చేయాల్సి ఉన్నా ఇంతవరకు చేయలేదన్నారు. అలాగే ట్రెజరీలో జీతాల బిల్లు కోసం రెన్యువల్ అడుగుతున్నారని ఎంపీ దృష్టికి తెచ్చారు. దీనికి ఎంపీ స్పందిస్తూ ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూస్తోందని, పులివెందుల కళాశాలకు వచ్చిన మెడికల్ సీట్లను కూడా తిరస్కరించడం జరిగిందన్నారు. రెన్యువల్ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళతానని, అవసరమైతే న్యాయ స్థానాన్ని ఆశ్రయిద్దామని వారికి తెలిపారు.

గూడూరు ప్రసాద్‌ను పరామర్శించిన ఎంపీ

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బలిజ సంఘానికి చెందిన ప్రెసిడెంట్ గూడూరు ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొంది పులివెందులకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రసాద్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన


జానపద పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో బస్టాండ్‌లు, మార్కెట్లు, జన సందోహ ప్రాంతాలలో బుధవారం హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆదేశాల మేరకు పులివెందుల ప్రాంత ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జానపద కళాకారులు వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద కళాకారులు సురక్షితం కానీ లైంగిక సంబంధాల ద్వారా, కలుషిత సూదులు, సిరంజిల ద్వారా, హెచ్‌ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు, కలుషిత రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ వస్తుందన్నారు. హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాకారులు చాలా చక్కగా జానపద పాటలచేత వివరించారు. అలాగే హెచ్‌ఐవీ యాక్ట్ 2017 హెచ్‌ఐవీ చట్టం గురించి వివరించారు. హెచ్‌ఐవీ గురించి ఎలాంటి సందేహం ఉన్నా 1097 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ ఎస్టీఐ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్‌వల్లి, ఎస్ఏహెచ్ఎస్ అధ్యక్షుడు రాజు, సీడీఎస్ మేనేజర్ వల్లి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం


యోగా చేస్తున్న అధికారులు, సిబ్బంది

వేంపల్లె : ప్రతి రోజూ యోగా చేయడంవలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ కుళాయమ్మ తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో యోగా శిక్షణను ప్రారభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు ప్రతి రోజూ ఉదయం యోగా చేయాలన్నారు. ఉద్యోగులు మానసికంగా, ఉల్లాసంగా ఉండేందుకు దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ జీవితంలో యోగ సాధనను అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, వైద్య సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలి


ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న భాగవత పండితులు

పులివెందుల రూరల్ : భాగవత పండితులకు, కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని భాగవత పండితులు, భాగవత భక్త సమాజ సమాఖ్య కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి రంగనాథ్ లు కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉన్న ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వారు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. భాగవత పండితులను, కళాకారులను గుర్తించి పింఛన్ మంజూరు చేసే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ మీ కోరికను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మీకు పింఛన్ వచ్చే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ భాగవత పండితులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సింహాద్రిపురంలో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

సింహాద్రిపురం : స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88 పదవ తరగతి విద్యార్థులు బుధవారం కలుసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు, అప్పటి గురువులు సహా పంక్తి భోజనం చేశారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : పెద్దపసుపుల జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం 1983–88 బ్యాచ్‌కు చెందిన 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 37 ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకోవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులు వెంకటసుబ్బారెడ్డి, శివారెడ్డి, శ్రీనువాసులరెడ్డి, సుబ్బారెడ్డిలను సత్కరించారు.


పెద్దపసుపుల జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మహిళల ఆరోగ్యంపై అవగాహన


వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది


ముద్దనూరులో అవగాహన ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక నగరిగుట్ట సచివాలయంలో బుధవారం డీడీ రమణమ్మ మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆమె మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, మహిళల ఆరోగ్యం, హక్కులు, గౌరవానికి ప్రాధాన్యత పునరుత్పత్తి సంరక్షణ, మానసిక ఆరోగ్యం, క్యాన్సర్ నివారణ, హృదయ సంబంధం ఆరోగ్యం వంటి కీలక రంగాలపై దృష్టి సారించడం ద్వారా తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. అలాగే రుతుక్రమ పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ స్నేహ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మహిళలకు నెల వారిగా వచ్చే ఋతుక్రమంలో పరిశుభ్రత అనేది పాటించాలని వైద్యులు లక్ష్మీప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగంలు తెలిపారు. బుధవారం వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఋతుస్రావం అనేది మహిళాలకు సాధారణ ప్రక్రియ అన్నారు. 10 నుండి 14 సంవత్సరాల నుండి మొదలై 49 సంవత్సరాల వరకు ఆగిపోతుందన్నారు. ప్రతి రోజూ స్నానం చేసి శరీరాన్ని పరిశుభ్రతగా ఉంచుకోవాలని కోరారు. ఒక వేళ నెలసరి క్రమబద్ధం అవ్వకపోతే దగ్గరలో ఉన్న గైనకాలజిస్ట్‌తో చూపించుకోవాలన్నారు. విశ్రాంతి, పోషకాహారం ఐరన్ కలిగిన ఆకుకూరలు, పండ్లు కూరగాయలు తీసుకోవాలన్నారు. శానిటరీ ప్యాడ్స్ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఇఓ ఫకృద్దీన్, సిహెచ్ఓ బసయ్య, ఎఫ్‌హెచ్ఎస్ కౌన్సిలర్ ప్రభావతి, సూపర్ వైజర్లు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : శుచి, పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందుతుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీకాంత్, నాగార్జునలు తెలిపారు. బుధవారం రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత కార్యక్రమాలపై వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది మే 28వ తేదీన ఈ ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, శరీరాన్ని పరిశుభ్రంగా వుంచుకోవాలని, శానిటరీ నాప్కిన్స్ వాడాలని, శుభ్రత పాటిస్తే ఆరోగ్యకరంగా వుంటామన్నారు.